# 82వ పుష్పము

82. ఓం శ్రీ సాయి - పురుషోత్తమాయ నమః

1) నామ పారాయణ ప్రియుడు

పురుషులలో ఉత్తముడు.

"పురుషాణా ముత్తమః పురుషోత్తమః అత్ర "న నిర్ధారణే" ఇతి షష్ఠీ సమాస ప్రతిషేధో న భవతి, జాతాద్య సపేక్షయా సమర్థత్వాత్. యత్ర పునః జాతి గుణ క్రియాపేక్షయా పృథక్క్రియా తత్రా సమర్థత్వా నిషేధః ప్రవర్తతే, యథా - మనుష్యా ణాం క్షత్రియః శూరతమః, గవాం కృష్ణా సంపన్న క్షీరతమా, అధ్వగానాం ధానవ శ్రీఘ్రతమ ఇతి. అథవా పంచమీ సమాసః తథాచ భగవద్వచనమ్.

"యస్మాత్ క్షర మతీతోహమక్షరాదపి చోత్తమః
అతోస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః" ఇతి

పురుషులలో నుత్తముడు (షష్ఠి), బ్రహ్మ పురుషులకంటె నుత్తముడు (పంచమీ).

పురుషుడు = "పురం శరీరం తస్మిన్ శేతే ఇతి పురుషః = పుర మనగా శరీరం. దాని యందుండు వాడు పురుషుడు. సమస్త జీవరాసుల శరీరములలో నుండు పురుషోత్తముడు. మొదటిది వ్యష్టి రూపము. రెండవది సమిష్టి రూపము. అసధాతువునకు వెనుక, ముందులుగా నక్షర సంయోగము వలన ముందున్నవాడు. ఆది పురుషుడు. ఉత్కర్షము గలవారి యందు ప్రకాశించువాడు. గొప్ప ఫలములను నొసగు వాడు. సంహార సమయమున లోకములను అంతమొందించినవాడు. నిందించుట వలన గాని, నశింపచేయుట వలన గాని పురుషుడు, అటువంటి పురుషోత్తముడైన స్వామికి నమస్కారము.

2) కవీశ్వరుడైన వాణీస్వరూపుడు -

పుడమి కన్నతల్లి పూజనీయురాలు కదా!
వారు మించువారు వసుధ లేరు।
కన్నతల్లి సేవకన్నా మించినదేది।
జన్మభూమి కన్న స్వర్గమేది।

దివ్య అద్వైత దర్శనము (Cont.) : (భగవద్గీతనుండి)

శ్లో॥ సర్వభూత స్థితం యో మాం। భజత్యేకత్వ మా స్థితః
సర్వథా వర్తమానోపి స యోగి మయి వర్తంతే॥ (6-3)

తా॥ సర్వ భూతాంతరాత్ముడగు నన్ను (పరమేశ్వరుని) ఎవడు ఏకాత్మ జ్ఞానము గలవాడై సేవించుచున్నాడో (ధ్యానించుచున్నాడో) అట్టి ధ్యాన యోగి ఎల్లప్పుడును పనులు చేయుచుండినను నాయందుండువాడే యగుచున్నాడు. ఆత్మజ్ఞాని పరమేశ్వరుని తన్ను ఏకముగనే చూచుచుండును. అట్టి వాడెల్లప్పుడును లోక హితార్థ కార్యములు చేయుచుండినను యేమియు చేయక యుండినను, సదా నాయందే (భగవంతునియందే) యుంటున్నాడు. అట్టివానికి మోక్ష విషయమై యవరోధము కలుగదు.

2) శ్లో॥ విద్యా వినయ సంపన్నే। బ్రాహ్మణే గవి హస్తిని।
శుని చైవ శ్వపాకే చ। పండిత స్సమ దర్శినః॥ (5-18)

తా॥ విద్యయు, వినయము పూర్తిగా గల బ్రాహ్మణుని యందు, గోవునందును, ఏనుగునందును, కుక్కయందును కుక్కను తినెడి శ్వపరుని యందును అంతర్యామియై ఒకే సర్వేశ్వరుడు వెలుగుచున్నాడని తెలిసికొన్న వారే జ్ఞానము గల వారగుదురు. ఇట్టి దివ్య తత్త్వము గలవారే పండితులనబడుదురు. బ్రాహ్మణుడు దుఃఖముతో నున్నప్పడు అతనికే లాగున సహాయము చేయుదురో, అలాగున శ్వపరుని కూడా (కుక్క మాంసము తిను ఒక జాతి) ఆదరించవలెను. గోవును ఎట్లు రోగము యున్నప్పడు రక్షింతురో, కుక్కలను కూడా దుఃఖములో యున్నప్పడు రక్షించ వలయును. ఇట్టి గుణము గలవాడు పండితుడు, ఆత్మజ్ఞానియున్ను అగును.

3) సకలతత్త్వ బోధకుడు - మానవ జన్మ విశిష్టత

"మానవ జన్మ అతిదుర్లభమైనది" అని భాగవతము చెప్పచున్నది. జంతువులలో నరజన్మ దుర్లభమని - వివేక చూడామణి, 84 లక్షల జీవరాసులలో మానవత్వము ఉత్కృష్టమైనదని పురాణములు, పవిత్రమైన చరిత్రలు ప్రబోధించుచున్నవి. ఈ మానవ విశిష్టత ఏమిటో మనము విచారించాలి. ప్రపంచంలో సృష్టి అంతా మానవత్వానికి పూర్వమే జరిగిందని కూడా పురాణములు చెప్పచున్నవి. కడ జన్మమే మానుష్యమని పురాణాలు చాటాయి.

4) సర్వజ్ఞుడు - వివేక చూడామణి (శ్రీ శంకర కృతము)

శ్లో॥ దుర్లభం త్రయమేవై తద్దై। వానుగ్రహ హేతకమ్।
మనుష్యత్వం ముముక్షత్వం। మహాపురుష సంశ్రయః ॥3॥

తా॥ (1) మనుష్య జన్మమెత్తుటయు (2) ముముక్షువగుటయు (3) మహాపురుషుల చెంత చేరుటయు ఈ మూడును దైవానుగ్రహము లేక సిద్ధింపవు. ఈ మూడున్నూ చేరుటయు మిక్కిలి కష్టముచే లభించును.

శ్లో॥ జన్తూనాం నరజన్మ దుర్లభమతః పుం స్త్వం తతో విప్రతా తస్మా
ద్వైదిక ధర్మమార్గ పరతా విద్వత్వ మస్మత్పరం।
ఆత్మానాత్మ వివేచనం। స్వనుభవో బ్రహ్మాత్మనా సంస్థిః।
ముక్తిర్నో శతకోటి జన్మ సుకృతైః పుణ్యైర్వినా లభ్యతే ॥

తా॥ (1) సకల ప్రాణులలో మనుష్య జన్మము మిక్కిలి దుర్లభము. (2) అట్టి మనుష్య జన్మములో పురుషుడై పుట్టుట దుర్లభము. (3) అట్టి పురుషులలో బ్రాహ్మణత్వము దుర్లభము. (4) అట్టి బ్రాహ్మణులలో వేదమార్గానుష్ఠానము గలిగియుండుట అతి దుర్లభము. (5) వేదమార్గానుష్ఠానపరులై యుండినను పాండిత్యము గలుగుట దుర్లభము (6) అట్టి పాండిత్యముకన్న "ఇది ఆత్మ వస్తువు, ఇది అనాత్మ వస్తువు" అని ఆత్మానాత్మ వివేకము కడు దుర్లభము. (7) అట్టి జ్ఞానం కలిగినను, ఆత్మానుభవ నిశ్చయ జ్ఞానము కలుగుట కడు దుర్లభము. (8) అట్టి ఆత్మానుభవము కంటె బ్రహ్మ సాక్షాత్కార జ్ఞానము కలుగుట కడుంగడు దుర్లభము. ఇదంతయూ ఈలాగుననుండగా, ముక్తియో, నూరుకోట్ల జన్మముల యందు చెప్పగా చేయబడిన పుణ్య కర్మలచే తప్ప పొందబడదు.

ఇట్లే భాగవతము చెప్పచున్నది (ఏకాదశ స్కంధము)

శ్లో॥ దుర్లభో మానుషో దేహో। ప్రాణినాం క్షణభంగురః।
తత్రాపి దుర్లభం మన్యే। వైకుంఠ ప్రియదర్శనమ్ ॥

తా॥ క్షణ భంగురమైన ప్రాణికోటి యొక్క జన్మములలో మానవ జన్మము అత్యంత దుర్లభము, అట్టి జన్మము పుణ్య వశమునే లభించినను, భగవద్భక్తుల దర్శనము కలుగుట మిక్కిలి దుర్లభము.

దుర్లభమగు మానుష జన్మమును, దేవతలు కూడా వాంఛింతురు. అట్టి మానవజన్మ పొంది, ఆత్మ (జీవ) విముక్తికై, అఖండానంద ప్రాప్తికై ప్రయత్నించని వాడు జడుడు. అట్టివాడు అన్ని హత్యలలో గొప్పదగు ఆత్మహత్యను చేసినవాడగును. "ఆత్మహనో జనాః" (ఈ.ఉ.) అని శ్రుతి. ఎందుకనగా సద్రూపమగు తనను, అసత్తని గ్రహించి చంపుచున్నాడు కదా. అవివేకియై పరమ ప్రయోజనమగు, పరమార్థ విషయమున ప్రయత్నింపక నెవడైతే మోసము చేయుచున్నాడో, వానికన్న అవివేకి మరియొకడు లేడు. శాస్త్రాలు అన్ని చదివినను, యజ్ఞ యాగాదులు చేసినను, సత్కర్మానుష్ఠానము చేసినను, దేవతలను సేవించినను ఎన్ని యుగములు గడచినను మోక్షమనునది రాదు. బంధ విమోనము కలుగదు. ఒక్క బ్రహ్మాత్మైక్య విజ్ఞానముచేతనే విముక్తి కలుగుతుంది. "అమృతత్వస్య నాశాస్తి విత్తేనే త్యేవ" (బృ.ఉ.) ధనముచేత అమృతత్వము రాదు. "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" "జ్ఞానత్వా త్మైవమే మతమ్" "జ్ఞానీచ విశిష్యతే" ఇతి శ్రుతి, స్మృతి పురాణ వాక్యములు. బ్రహ్మ సాక్షాత్కారము గల పురుషుడే కృతకృత్యుడు. "జ్ఞానాదేవతు కైవల్యం" (ఛాం.ఉ.) ఇతిశ్రుతి. జ్ఞానము చేతనే మోక్షము కలుగును. జ్ఞానమునకు అందరూ అర్హులే. బ్రాహ్మణత్వము లేని

1) ధర్మరాజు, జనకులు మొదలగు క్షత్రియులు.

2) విదురుడు మొదలగు శూద్రులును.

3) ఉపనయన సంస్కారములేని గార్గి, మైత్రేయి, సులభాదిక స్త్రీలును.

4) రైక్వాది వర్ణాశ్రమ జాతులును.

5) కహల్యాది వైశ్యులును.

6) ఇంద్రాది దేవతలును.

7) ప్రహ్లాదాది రాక్షసులును

అందరూ బ్రహ్మ జ్ఞానమునకు అర్హులే. బ్రహ్మజ్ఞానము చేతనే కృతకృత్యులైనారు. అవుతారు.

5) ప్రేమస్వరూపుడు - అవతారమూర్తి

"నీవు భగవంతుడవు మానవులంతా భగవంతులే. జీవమున్న పదార్థము. జ్ఞానము లేని పదార్థము అంతా భగవత్ సమమే. నేను భగవంతుడను, అది నేను తెలిసికోనక్కర లేదు. నేను ఎల్లప్పడు అంతే. నేను అవతారమూర్తిని. నేను ఎల్లప్పడూ అవతారమూర్తినే. నేను ఎల్లప్పడూ ప్రేమ స్వరూపుడనే" (స్వామి)

దివ్యలీల : క్లారిను ఒసిస్సు అమెరికను పారా సైకాలజిస్టు, అసిస్టెంటు హెండర్సను, "నా మహత్యాలు, లీలలు అన్నీ ప్రదర్శనానికి కాదు. నా దివ్యత్వ నిదర్శనానికి, నా భక్తులను రక్షించేటందులకు, ఆనందింప చేయుటకును అప్పడు మీరు చూడండి" అన్నారు స్వామి వారితో. 20 రోజులు స్వామితో యున్నారు. అనేక మహత్యాలు చూచారు, అనుభూతులు పొందారు. వారి రిపోర్టులో "మా 25 సం॥ల అనుభవములో ఇటువంటి లీలలను మేము ఎక్కడా ప్రపంచంలో చూడలేదు. మోసమేమీలేదు" అని తమ యూనివర్శిటీకి రిపోర్టు పంపారు.

దివ్య చికిత్స : విమానదళ అధిపతి మెహ్రా అల్లుడికి మూత్రపిండములలో రాళ్ళు వున్నాయన్నారు. బెంగుళూరులో ఆపరేషను అయింది. ఒకరోజు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మెహ్రా స్వామి వద్దకు పరుగెత్తాడు. డాక్టర్లు మళ్ళా ఆపరేషను చెయ్యాలంటున్నారని స్వామితో చెప్పాడు. స్వామి విభూతి ఇచ్చి వాడమన్నారు. మరునాడు పరీక్ష చేసి డాక్టర్లు ఆపరేషనుఅక్కర లేదన్నారు. మెహ్రా "స్వామి ప్రేమ, దయ అనుభవించాను" అన్నాడు. గోకకు "స్వామి మనస్సును, తత్వాన్ని, నడకను మార్చగల ప్రజ్ఞాశాలి" అన్నాడు.

6) సర్వజన ప్రియుడు - ప్రేమ (డా. మనమోహను వర్మ)

ప్రేమ శక్తివంతమైన ఆయుధం. "దినచర్య ప్రేమతో ప్రారంభించు. దినమెల్లా ప్రేమతో గడుపు. చివరకు ప్రేమతో ముగించు" అన్నారు స్వామి. వెలుతురు. చీకటి ఒకచోట యుండవు. ప్రేమ భక్తుని ఆచరించి పైకి ఎత్తుతుంది. ఆనందం ఇస్తుంది. ఏ వస్తువైనా కొనవచ్చును. కాని ప్రేమను కొనలేము. ప్రేమను స్వామియే ఇవ్వాలి.

7) స్తుతి ప్రియుడు - దివ్య భజన - సాయి దేవుడు - మరియు

8) వేదాంత వేద్యుడు -

రామకృష్ణ వాసుదేవ । అచ్యుతా । అనంతా ।
పర్తివాస । సాయిదేవ । శ్రీధరా । అనంతా ॥రా॥
గోపీ జనోద్ధార । రాధాలోల ।
భక్త జనోద్ధార । భక్తిగానలోలా ॥రా॥

దివ్య జ్ఞానయోగము (Cont.) : ఇంక జ్ఞేయమును గూర్చి చెప్పబడుతోంది. ఏది జ్ఞేయమో, దేనిని గూర్చి తెలిసికొనిన అమృతత్వము లభించునో అది వర్ణింపబడుతోంది. అది అధికరహితమగు పరబ్రహ్మము. సత్ ప్రత్యయమునకును, అసత్ ప్రత్యయమునకును కూడా గోచరము కానిది. ఈ రెండు శబ్దాలకు కూడా లక్ష్యము. ఎందుకంటె ఇంద్రియములకు గోచరమగు వస్తువులన్నియును సద సద్వాచ్యములు. కాని బ్రహ్మము ఇంద్రియ గోచరము కాదు.

"నిర్గుణుడు'

"దర్శయతి చాధ అపిస్మర్యతే" (బ్ర.సూ.3-2-17)

తా॥ "పరమేశ్వరుడు నిరాకారుడు" అను విషయమును గూర్చి ప్రతిపాదింపబడు చున్నది. "అధాత ఆదేశో నేతి నేతి" (బృ.ఉ. 4-36) = ఈ పదార్థము కాదు. ఈ పదార్థమే కాదు. అని అన్నిటిని నిషేధింపగా, నిషేధింపగా కడకు

పరమేశ్వరుడే మిగులును. “అన్యే దేవ తద్విథితా దథో అవిదితా దథి” (కే-3) “ఆ పరబ్రహ్మము బుద్ధికి గోరములగు వానికంటెను, కానివానికంటెను గూడా భిన్నుడు” అని కేనోపనిషత్తు యందును వర్ణింపబడి యున్నది. తైత్తిరీయో పనిషత్తు నందును “యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహా” = వాక్కుగాని మనస్సుగాని ఏ స్థలమునకు పోవ లేవో, యదియే బ్రహ్మము” అని చెప్పబడి యున్నది. బాష్కలి యనువాడు బాధ్యుడను వానిని, పరమేశ్వరుని గూర్చి ప్రశ్నింపగా బాధ్యుడు మౌనము వహించెను. అప్పుడు బాష్కలి మరల మరల ప్రశ్నించగా బాధ్యుడు “నేను పరమేశ్వ రుని గురించి బోధించితిని, కాని నీవెరుంగలేకున్నావు. పరమేశ్వరుడు నిర్గుణుడు. ఆయనను గురించి చెప్పవలసిన దేమియు లేదు” అని చెప్పెను. అట్లే స్మృతులు కూడా నిట్లే నిషేధపూర్వకముగా పరమేశ్వర రూపమును బోధింపబడి యున్నది.

“జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యజ్ఞాత్వామృతిమశ్నుతే ।
అనాదిమత్పరం బ్రహ్మ న సత్తాన్నాసదుచ్యతే ॥ (భ.గీ. 13-12)

ఓ అర్జునా! ఏ బ్రహ్మమును తెలిసికొనవలయునో, దాని స్వరూపమును చెప్పెదను వినుము. అది అనాది. ఇంద్రియ గోచరము కాకపోవుటచే, గలదనికాని, లేదనిగాని దానిని గూర్చి చెప్పటకు వీలుకాదు” అని శ్రీకృష్ణుడు చెప్పి యున్నాడు. ఇదియునుగాక, విశ్వరూపమును ధరించిన నారాయణుడు నారదునితో “మయా హేష్యా మయా సృష్టా మన్మాం పశ్యసి నారదః సర్వభూత గుణైర్యుక్తం నైవం మాం జ్ఞాతు మర్హసి” (స్మృతి) = ఓ నారదా! ప్రస్తుతము పృథి వ్యాది సర్వభూత గుణములతో గూడియున్నట్లు నేను కానవచ్చు చున్నాను గదా! యిది యంతయు నా మాయ. నా యదార్థ స్వరూపము ఇట్టిదని భ్రాంతి నొందకుము.” ఈ వాక్యము స్పష్టముగనే పరమేశ్వరుని రూపము నిషేధించు చున్నది. యేయే యాకారము మనో వాక్కులకు గోచరమగుచున్నదో, అదియంతయు పరమేశ్వరుని రూపము కాదు శ్రుతియు విధిపూర్వకముగ నిరూపించుటకు వీలులేక, నిషేధ పూర్వకముగా నీ బ్రహ్మ రూపమును నుపదేశించెను. విధి పూర్వకముగా నీ బ్రహ్మమునుపదేశించు వాక్యములు కొన్ని యున్నను, అవి చేయునది సూక్ష్మ ఉపాధి ఉపదేశమే కాని, స్వస్వరూప కథనము కాదు. బ్రహ్మమునకు కల్పితమైన ఆకారము ఉపాసనార్థము ప్రతిపాదించుటయే. సాకార బ్రహ్మ ప్రతిపాదిత వాక్యములకు ఇదియే గతి. అందుచే పరమేశ్వరుడు “నిర్గుణుడే.”.

**ఓం తత్సత్**